

TG/TEL/25/A3731

# నిజం

దృష్టి తెలుగు న్యూస్

WANTED
రిపోర్టర్లు కావలెను

నిజం దృష్టి తెలుగు న్యూస్

దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాదాన్యత ఇవ్వబడును.

సెల్: 9247842354

హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-274 | పేజీలు:-4 | శనివారం 19-09-2026

Hydrabab | Editer name : varudu sujatha | volume:01, | issue:274 | pages:04 | Saturday - 19-09-2026

## పాకిస్థాన్‌ను చుట్టుముట్టిన ఆర్థిక సంక్షోభం

కోరలు చాస్తున్న పేదరికం

- పాకిస్థాన్‌లో ప్రమాదకర స్థాయికి చేరిన పేదరికం
- గడిచిన ఆరేళ్లలో 21.8శాతం నుంచి 28.9శాతానికి పెరిగిన వైనం
- పట్టణాలతో పోలిస్తే గ్రామాల్లోనే ఎక్కువ ప్రభావం
- అధిక ద్రవ్యోల్బణం, ఆర్థిక సంక్షోభాలే ప్రధాన కారణాలు
- వృద్ధి ఫలాలు సంపన్నులకే.. పేదలకు తప్పని కష్టాలు




దాయాది దేశం పాకిస్థాన్‌ను పేదరికం చుట్టుముడుతోంది. గడిచిన ఆరేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒడిదొడుకులకు లోనుకావడంతో - మిగతా 2 లో

## పశ్చిమాసియా యుద్ధంలో మునిగిన ప్రపంచం

హర్మూజ్, సూయజ్ వ్యాపారానికి పెను ముప్పు!

- హర్మూజ్ ద్వారా చమురు రవాణా రెండొంతులకు పునరుద్ధరణ
- రవాణా పూర్తిగా నిలిచిపోయిందనే వాదనలను కొట్టిపారేసిన అమెరికా
- జోర్డాన్‌లోని అమెరికా బేస్‌పై ఇరాన్ దాడి, ఇద్దరు యూఎస్ సైనికుల మృతి
- సూయజ్ కాలువను మూసివేయడానికి ఇరాన్ ప్రయత్నం?
- యుద్ధం కారణంగా విపరీతంగా పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు



పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ లాంటి చమురు రవాణా మార్గాలను ప్రమాదంలోకి - మిగతా 2 లో

## తెలంగాణకు కొత్త మెట్రో

ప్రాజెక్టులకు అనుమతులపై కేంద్రమంత్రి కీలక వ్యాఖ్యలు



- తెలంగాణలో కొత్త మెట్రో రైలు ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వలేదని కేంద్రం స్పష్టం
- రాజ్యసభలో ఎంపీ ప్రశ్నకు కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ రాతపూర్వక సమాధానం
- హైదరాబాద్ మెట్రో ఫేజ్-1కు రూ.1,204 కోట్లు ఇచ్చామని వెల్లడి
- ఏపీలో ఎలాంటి మెట్రో ప్రాజెక్టులు అమలులో లేవని స్పష్టీకరణ

తెలంగాణలో కొత్తగా ఎటువంటి మెట్రో రైలు ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేయలేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. - మిగతా 2 లో

## తిరుమలకు భారీగా భక్తుల రాక

31 కంపార్ట్‌మెంట్లు ఫుల్



- తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ
- వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 31 కంపార్ట్‌మెంట్లు పూర్తి
- శ్రీవారి సర్వదర్శనానికి సుమారు 18 గంటల సమయం
- ఆదివారం రూ. 4.05 కోట్లుగా నమోదైన హుండీ ఆదాయం
- నిన్న శ్రీవారిని దర్శించుకున్న 90,956 మంది భక్తులు

తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. గత కొన్ని - మిగతా 2 లో

# 22ఏ భూములపై సర్కార్ కీలక నిర్ణయం

- సమస్యలకు చెక్ పెట్టేలా హైలెవల్ కమిటీ!
- ఛైర్మన్‌గా సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్
- ఇద్దరు ఉన్నతాధికారులు సభ్యులుగా నియామకం
- భూ యజమానుల విజ్ఞప్తుల పరిశీలన
- క్షేత్రస్థాయి సమస్యలపై కమిటీ దృష్టి
- పరిష్కారానికి కార్యాచరణ రూపొందించనున్న కమిటీ




## స్కైరూట్ విజయం వేళ రాహుల్ వయసుపై

# ప్రధాని మోదీ చురకలు

- ప్రైవేట్ రాకెట్ ప్రయోగించిన యువతను ప్రశంసించిన ప్రధాని మోదీ
- రాహుల్ గాంధీ వయసును ఉద్దేశించి పరోక్షంగా సెటైర్లు
- స్కైరూట్ బృందం సగటు వయసు 28 అని వెల్లడి
- తాను మాట్లాడుతోంది 56 ఏళ్ల యువకుడి గురించి కాదన్న ప్రధాని




పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. భారత్‌లో తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్‌ను విజయవంతంగా

## ఉక్రెయిన్‌లో కార్గో నౌకపై దాడి

నలుగురు భారతీయులతో సహా పలువురు మృతి



- ఉక్రెయిన్‌లోని ఒడెస్సా సమీపంలో పౌర నౌకపై క్షిపణి దాడి
- ధాన్యం లోడుతో వెళుతున్న పౌర కార్గో నౌక లక్ష్యంగా దాడి
- దాడిలో మరో భారతీయుడికి తీవ్ర గాయాలు

ఉక్రెయిన్‌లోని ఒడెస్సా నౌకాశ్రయం సమీపంలో పెను విషాదం చోటుచేసుకుంది. - మిగతా 2 లో

## విద్యార్థులపై లాఠీచార్జ్ స్పందించిన రాహుల్ గాంధీ



- పరీక్షల్లో అక్రమాలపై ఢిల్లీలో విద్యార్థుల భారీ నిరసన
- పార్లమెంట్ వైపు వెళుతున్న ఆందోళనకారులపై పోలీసుల లాఠీచార్జ్
- విద్యార్థులపై దాడి అప్రజాస్వామికమని రాహుల్ గాంధీ తీవ్ర విమర్శ
- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని నిరసనకారుల డిమాండ్

పరీక్షల్లో జరుగుతున్న అక్రమాలకు వ్యతిరేకంగా పార్లమెంట్ ముట్టడికి యత్నించిన - మిగతా 2 లో

## దశాబ్దాల మొండి సమస్యకు మంత్రి నారా లోకేశ్ శాశ్వత పరిష్కారం



- మంగళగిరిలో దశాబ్దాల ఇంటి స్థలాల సమస్యకు మంత్రి లోకేశ్ పరిష్కారం
- 'మన ఇల్లు -- మన లోకేశ్' కింద రెండో విడతలో 3 వేల మందికి పట్టాల పంపిణీ
- ఈ నెల 21, 22 తేదీల్లో లబ్ధిదారులకు పట్టాలు అందించనున్న మంత్రి
- నిషేధిత జాబితాలోని భూములకు ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు జారీ
- సుమారు రూ.1,000 కోట్ల విలువైన భూములకు పేదలకు శాశ్వత హక్కులు

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, మంగళగిరి నియోజకవర్గంలో దశాబ్దాలుగా నెలకొన్న జఠిలమైన భూ సమస్యకు రాష్ట్ర ఐటీ, - మిగతా 2 లో

## ఏపీలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

# ప్రైవేటీకరణ చేస్తున్నారా?

సీఎం చంద్రబాబు సమాధానం ఇదే!

- సబ్-రిజిస్ట్రార్ ఆఫీసుల ప్రైవేటీకరణ వార్తలు అవాస్తవమన్న చంద్రబాబు
- పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల మాదిరిగా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు అని వివరణ
- దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని అధికారులకు సీఎం ఆదేశం
- ఉద్దేశపూర్వకంగా పిటిషన్లు వేసేవారిని గుర్తించాలని సూచన
- రాష్ట్రంలో 49% వర్షపాత లోటు.. ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి




రాష్ట్రంలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటీకరిస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజలకు మరింత మెరుగైన,

## పదో తరగతి ఫెయిల్ గ్రేస్ మార్కులతో పాసయ్యా



- చదువుతో పేదరికాన్ని జయించవచ్చన్న మంత్రి నారాయణ
- పదో తరగతి ఫెయిల్ అయినా పట్టుదలతో పైకొచ్చానని వెల్లడి
- నెల్లూరులో ప్రతిభావంతులైన విద్యార్థులకు అవార్డుల ప్రదానం
- అవకాశాలను అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు పిలుపు

చదువుతో పేదరికాన్ని జయించవచ్చని, కష్టపడితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఏపీ - మిగతా 2 లో

## దశాబ్దాల మొండి సమస్యకు మంత్రి నారా లోకేశ్ శాశ్వత పరిష్కారం

మొదటిపేజీ తరువాయి – విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ శాశ్వత పరిష్కారం చూపారు. ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు యాజమాన్య హక్కులు కల్పించే ప్రక్రియను వేగవంతం చేశారు. ఇందులో భాగంగా, 'మన ఇల్లు -- మన లోకేశ్' కార్యక్రమం కింద రెండో విడతలో సుమారు 3,000 కుటుంబాలకు ఈ నెల 21, 22 తేదీల్లో శాశ్వత పట్టాలు పంపిణీ చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళగిరి నియోజకవర్గంలోని కొండవాలు, అటవీ, దేవాలయ భూముల్లో వేలాది కుటుంబాలు దశాబ్దాలుగా ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నాయి. అయితే, ఆ స్థలాలపై వారికి ఎలాంటి చట్టబద్ధమైన హక్కులు లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ ఆస్తులను పిల్లలకు బదిలీ చేయాలన్నా, అత్యవసరానికి రుణం పొందాలన్నా వీలుకాని దుస్థితి నెలకొంది. ఎన్నికల ప్రచారంలో ఈ సమస్యను గుర్తించిన లోకేశ్, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆ మాట ప్రకారం, అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు చేపట్టారు. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే తొలి విడతలో భాగంగా రత్నాల చెరువు, యర్రబాలెం, నీరుకొండ వంటి ప్రాంతాల్లో 3,002 మందికి సుమారు రూ.1,000 కోట్ల విలువైన భూములపై శాశ్వత హక్కులు కల్పించారు. ప్రస్తుతం రెండో విడతలో భాగంగా మంగళగిరి డీజీపీ కార్యాలయం సమీపంలోని సీకే కన్వెన్షన్ హాలులో పట్టాల పంపిణీ కార్యక్రమం జరగనుంది. ఈ విడతలో అందించే పట్టాల మార్కెట్ విలువ కూడా సుమారు రూ.1,000 కోట్లు ఉంటుందని అంచనా.

**వివిధ కేటగిరీల కింద పట్టాల పంపిణీ:**

సెక్షన్ 22ఏ సమస్యకు పరిష్కారం: మంగళగిరి, నవులూరు గ్రామాల్లోని కొన్ని సర్వే నంబర్ల భూములు సెక్షన్ 22ఏ(1)(ఖ) కింద నిషేధిత ఆస్తుల జాబితాలో ఉండటంతో 1,622 నివాస గృహాల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఈ నిషేధాన్ని తొలగిస్తూ, ఆర్డీవో ధ్రువీకరించిన 'ప్రాపర్టీ ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ల'ను మంత్రి లోకేశ్ లబ్ధిదారులకు అందజేయనున్నారు.

**స్టీల్ బ్రిడ్జ్ నిర్వాసితులకు పట్టాలు:** అమరావతిలో బకింగ్‌హామ్ కాలువపై స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణంతో నిర్వాసితులైన 81 మందికి పునరావాసం కింద ఆత్మకూరు లేఅవుట్‌లో ప్లాట్లను కేటాయించారు. వీరికి సంబంధించిన పట్టాలను కూడా ఈ కార్యక్రమంలో పంపిణీ చేయనున్నారు.

**+.ా.వీం.చీశీ.30 కింద క్రమబద్ధీకరణ:** 150 చదరపు గజాల లోపు విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ స్థలాలను క్రమబద్ధీకరిస్తూ 906 పట్టాలను సిద్ధం చేశారు. వీటిలో తాడేపల్లి మండలానికి 630, మంగళగిరి మండలానికి 276 పట్టాలు ఉన్నాయి. మొత్తంమీద, దశాబ్దాలుగా కాగితాలపై హక్కుల్లేక అభద్రతాభావంతో జీవిస్తున్న వేలాది కుటుంబాలకు మంత్రి లోకేశ్ చొరవతో శాశ్వత భరోసా లభించనుంది.

## పదో తరగతి ఫెయిల్ గ్రేస్ మార్కులతో పాసయ్యా

మొదటిపేజీ తరువాయి – పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. సోమవారం నెల్లూరు జిల్లాలో జరిగిన 'షైనింగ్ స్టార్ అవార్డ్స్ – 2026' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులు, మెడల్స్, నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మంత్రి స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ తన జీవితంలోని ఆసక్తికర విషయాలను విద్యార్థులతో పంచుకున్నారు. తాను పదో తరగతి ఫెయిల్ అయ్యానని, ఆ తర్వాత గ్రేస్ మార్కులతో పాస్ అయినట్లు వెల్లడించారు. ఆ వైఫల్యమే తనలో పట్టుదలను పెంచిందని, మూడేళ్ల డిగ్రీలో యూనివర్శిటీ టాపర్‌గా నిలిచి స్టాటిస్టిక్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించానని గుర్తుచేసుకున్నారు. కష్టపడి చదివితేనే లక్ష్యాలను చేరుకోగలరని విద్యార్థులకు సూచించారు. చదువు పూర్తయ్యాక వీఆర్సీలో రూ.40 జీతానికి పార్ట్‌టైం లెక్చరర్‌గా పనిచేశానని, ప్రభుత్వ అధ్యాపకుడిగా అవకాశం వచ్చినా రాజీనామా చేసి, ట్యూషన్లు చెబుతూ కష్టపడి ఈ స్థాయికి వచ్చానని వివరించారు. యువనేత నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని మంత్రి కొనియాడారు. ఈ మార్పులను, అందివస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## తెలంగాణకు కొత్త మెట్రో

మొదటిపేజీ తరువాయి – సోమవారం రాజ్యసభలో కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ఈ విషయాన్ని వెల్లడించారు. బీజేపీ ఎంపీ ఆర్. కృష్ణయ్య అడిగిన ప్రశ్నకు ఆయన రాతపూర్వక సమాధానం ఇచ్చారు. దేశవ్యాప్తంగా 26 నగరాల్లో 1,159 కిలోమీటర్ల మేర మెట్రో నెట్‌వర్క్ ఉందని మంత్రి తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-1ను రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో అమలు చేసిందని, ఈ ప్రాజెక్టుకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద కేంద్రం రూ.1,204 కోట్లు విడుదల చేసిందని పేర్కొన్నారు. ఇదే క్రమంలో పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఎటువంటి మెట్రో ప్రాజెక్టులు అమలులో లేవని, అందువల్ల కేంద్రం నుంచి ఆర్థిక సాయం అందించలేదని కూడా స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో మెట్రో ఫేజ్-2 విస్తరణ కోసం తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. శంషాబాద్ విమానాశ్రయం, ఐటీ హబ్స్, పాతబస్తీ మరియు శివారు ప్రాంతాలను కలుపుతూ పలు కారిడార్లలో విస్తరణ చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించిన వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదికలను (డీపీఆర్) కూడా ఇప్పటికే కేంద్రానికి సమర్పించింది. ప్రాజెక్టు వ్యయాన్ని చెరిసగం పంచుకోవడానికి లేదా అవసరమైతే పూర్తి వ్యయాన్ని భరించడానికైనా సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు మెట్రో విస్తరణ అత్యవసరమని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే కేంద్ర మంత్రులతో పలుమార్లు చర్చలు జరిపారు. అయితే, కేంద్ర ప్రభుత్వం తాజాగా చేసిన ప్రకటనతో కొత్త ప్రాజెక్టులకు సంబంధించిన తుది అనుమతులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని స్పష్టమవుతోంది.c

## తిరుమలకు భారీగా భక్తుల రాక

మొదటిపేజీ తరువాయి – రోజులుగా కొనసాగుతున్న రద్దీ సోమవారం కూడా తీవ్రస్థాయిలో ఉంది. దీంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని మొత్తం 31 కంపార్ట్‌మెంట్లు భక్తులతో పూర్తిగా నిండిపోయాయి. ప్రస్తుతం టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి సుమారు 18 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు. నిన్న ఆదివారం (జులై 19) ఒక్కరోజే 90,956 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. స్వామివారికి 33,046 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.05 కోట్లుగా నమోదైంది. రద్దీకి అనుగుణంగా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. ఆదివారం నాడు టీటీడీ మొత్తం 4.44 లక్షల లడ్డూలను భక్తులకు విక్రయించింది. అదేవిధంగా, 2.94 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేసింది. యాత్రికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వైద్య కేంద్రాల ద్వారా 3,708 మందికి వైద్య సేవలు అందించినట్లు టీటీడీ వెల్లడించింది. భక్తుల రద్దీ కొనసాగుతున్నందున, యాత్రికులు ఈ విషయాన్ని గమనించి తమ ప్రయాణాన్ని ప్రణాళిక చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## విద్యార్థులపై లాఠీచార్జ్... స్పందించిన రాహుల్ గాంధీ

మొదటిపేజీ తరువాయి – విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడం, బాష్పవాయువు ప్రయోగించడాన్ని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు. ఇది అత్యంత అప్రజాస్వామికమని, భారతీయ సంప్రదాయానికి విరుద్ధమని ఆయన కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. సోమవారం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తరుణంలో, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో వేలాది మంది విద్యార్థులు, యువకులు ఢిల్లీ వేదికగా నిరసన చేపట్టారు. నీట్ వంటి పోటీ పరీక్షల్లో వరుసగా చోటుచేసుకుంటున్న పేపర్ లీకేజీలు, ఇతర అక్రమాలపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో చోటుచేసుకున్న తోపులాటతో ఉద్రిక్తత నెలకొనగా, ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేసి, టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనపై రాహుల్ గాంధీ ఘాటుగా స్పందించారు. "ఢిల్లీ వీధుల్లో నిరసన తెలుపుతున్న వారు నేరస్థులు కాదు, తమ హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులు. వారిపై బలప్రయోగం చేయడం తగదు" అని ఆయన హితవు పలికారు. దేశంలో 152 పేపర్ లీకేజీల వల్ల సుమారు 7.5 కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిన్నా, ప్రభుత్వం మాత్రం బాధ్యులను కాపాడటానికే ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.ద

## ఉక్రెయిన్‌లో కార్గో నౌకపై దాడి



మొదటిపేజీ తరువాయి – ధాన్యంతో వెళుతున్న ఒక పౌర కార్గో నౌకపై క్షిపణి దాడి చేయడంతో, నలుగురు భారతీయులతో సహా పలువురు ప్రాణాలు కోల్పోయారు. నల్ల సముద్రంలో పౌర నౌకల భద్రతకు పొంచి ఉన్న ముప్పును ఈ ఘటన మరోసారి స్పష్టం చేస్తోంది. కాగా, ఈ క్షిపణి దాడి చేసింది రష్యానే అని ఉక్రెయిన్ ఆరోపిస్తోంది. టర్కీకి చెందిన, గినియా–బిస్సావ్ పతాకంతో ప్రయాణిస్తున్న 'గోల్డెన్ లియో' అనే బల్క్ క్యారియర్ నౌక, జూలై 19న ఒడెస్సా పోర్టు నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే ఈ దాడికి గురైంది. ప్రమాద సమయంలో నౌకలో మొత్తం 17 మంది సిబ్బంది ఉన్నారు. సహాయక బృందాలు కొందరిని రక్షించి ఒడెస్సాలోని ఆసుపత్రికి తరలించాయి. ఈ ఘటనలో ఉక్రెయిన్ పైలట్‌తో పాటు మరికొందరు మరణించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ నౌకలో మొత్తం ఐదుగురు భారతీయులు ఉన్నట్లు భారత విదేశాంగ శాఖ ధ్రువీకరించింది. వారిలో నలుగురు దుర్మరణం పాలవ్వగా, మరొకరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఉక్రెయిన్‌లోని భారత రాయబార కార్యాలయం స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ బాధితులకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తోంది. "ఉక్రెయిన్‌లోని తాజా పరిస్థితులను తమ బృందం నిశితంగా పర్యవేక్షిస్తోందని, బాధితులకు అండగా నిలిచేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని విదేశాంగ శాఖ పేర్కొంది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, గాయపడిన వ్యక్తి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది.ఈ దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. "వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడం, అమాయక పౌర సిబ్బంది ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టడం, నౌకాయానం మరియు వాణిజ్య స్వేచ్ఛకు ఆటంకం కలిగించడం అత్యంత విచారకరం. ఇలాంటి దాడులు ఏమాత్రం ఆమోదయోగ్యం కావు" అని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

## ఏపీలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ప్రైవేటీకరణ చేస్తున్నారా?

మొదటిపేజీ తరువాయి – సులభతరమైన సేవలు అందించేందుకే 'రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు' (=ాఖ) ఏర్పాటు చేస్తున్నామని, దీనిపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టాలని అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో వివిధ శాఖల పనితీరుపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల ప్రైవేటీకరణ అంశం చర్చకు వచ్చింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "ప్రజలకు మెరుగైన రిజిస్ట్రేషన్ సేవలు అందించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను స్థాపిస్తున్నాం. ఇది ఎంతమాత్రమూ ప్రైవేటీకరణ కాదు" అని తేల్చిచెప్పారు. డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, డాక్యుమెంట్ రైటర్ల ఉపాధికి ఇబ్బంది లేని విధంగా మార్గాలు చూపెడతామని చంద్రబాబు హామీ ఇచ్చారు. పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల మాదిరిగానే ఈ కేంద్రాలు పనిచేస్తాయని, వాటి పనివిధానాన్ని ప్రజలకు వివరించాలని అధికారులకు సూచించారు. పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల వల్ల ఆ ప్రక్రియ ఎంత సులువుగా మారిందో, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కూడా అదే విధంగా మారుతుందని ఆయన వివరించారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగానే ఈ కేంద్రాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని చంద్రబాబు ఆరోపించారు. "వాస్తవాలను ప్రజలకు వివరించి, రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేయాల్సిన బాధ్యత అధికారులదే. ఇక డాక్యుమెంట్ రైటర్లు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారి ఉపాధికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తాం" అని భరోసా ఇచ్చారు.

**వివిధ అంశాలపై సీఎం కీలక ఆదేశాలు**

సమీక్షలో భాగంగా పలు ఇతర అంశాలపైనా ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. 'దీపం-2.0' పథకం లబ్ధిదారులకు సబ్సిడీ చెల్లింపులను క్రమబద్ధంగా చేపట్టాలని, వీలైతే నిర్దిష్ట తేదీల్లో చెల్లింపులు చేసేలా చూడాలని సూచించారు. పౌరసరఫరాల, ఆర్థిక శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి, సాంకేతిక అంశాలను పరిశీలించి దీనిని అమలు చేయాలన్నారు. అదేవిధంగా, కేవలం ప్రభుత్వాన్ని, అధికారులను బద్నాం చేయాలనే ఉద్దేశంతో ప్రజాప్రయోజనం లేని ఫిర్యాదులు చేసే 'లిటిగెంట్ పిటిషనర్ల'ను గుర్తించి కౌన్సిలింగ్ ఇవ్వాలని చంద్రబాబు ఆదేశించారు. "రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి 81 మందిని గుర్తించాం. ఒక్కొక్కరు సగటున 246 పిటిషన్లు దాఖలు చేస్తున్నారు. వీరి వివరాలను జిల్లా కలెక్టర్లకు పంపాలి. ప్రజాప్రయోజనం ఉన్న పిటిషన్లను తప్పక పరిశీలించాలి, కానీ దురుద్దేశంతో వేసే వాటిని గుర్తించాలి" అని అన్నారు. ఆర్థికేతర ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని, ఆర్థికపరమైన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో 49 శాతం వర్షపాత లోటు ఉందని, దీని ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ వ్యూహాలు అన్వేషించాలని సీఎం సూచించారు. రైతుల్లో అవగాహన కల్పించి, మెట్ట పంటల సాగును ప్రోత్సహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## పాకిస్థాన్‌ను చుట్టుముట్టిన ఆర్థిక సంక్షోభం

మొదటిపేజీ తరువాయి – ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒడిదొడుకులకు లోనుకావడంతో నిరుపేదల సంఖ్య ప్రమాదకర స్థాయిలో పెరిగిపోయింది. వరుస ఆర్థిక సంక్షోభాలు, అధిక ద్రవ్యోల్బణం, బలహీనమైన వృద్ధి రేటు వంటి కారణాలతో కుటుంబ ఆదాయాలు గణనీయంగా క్షీణించాయి. ఫలితంగా దేశ జనాభాలో దాదాపు 29 శాతం మంది పేదరిక రేఖకు దిగువన జీవిస్తున్నారని ఒక తాజా నివేదిక వెల్లడించింది. 2018-19లో 21.8 శాతంగా ఉన్న పేదరికం, 2024-25 నాటికి 28.9 శాతానికి చేరింది. అంటే కేవలం ఆరేళ్లలోనే పేదరికం 7 శాతం పెరిగింది. హౌస్‌హోల్డ్ ఇంటిగ్రేటెడ్ ఎకనామిక్ సర్వే (హెచ్‌ఐఈఎస్), పాకిస్థాన్ సోషల్ అండ్ లివింగ్ స్టాండర్డ్స్ మెజర్‌మెంట్ (పీఎస్ఎల్ఎం) డేటా ఆధారంగా 'డాన్' పత్రిక ఈ విశ్లేషణను ప్రచురించింది. దాదాపు ఆరేళ్ల విరామం తర్వాత విడుదలైన ఈ గణాంకాలు.. దేశం ఎదుర్కొన్న బహుళ సంక్షోభాల ప్రభావాన్ని స్పష్టం చేస్తున్నాయి. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాలపై ఈ ప్రభావం మరింత తీవ్రంగా ఉంది. గ్రామీణ పాకిస్థాన్‌లో పేదరికం సుమారు 8 శాతం మేర పెరగగా, పట్టణ ప్రాంతాల్లో ఇది 6 శాతంగా నమోదైంది. పదేపదే తలెత్తిన చెల్లింపుల సంక్షోభం, కోవిడ్-19 మహమ్మారి, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, దీర్ఘకాలిక స్థూల ఆర్థిక సర్దుబాట్లు వంటివి ఈ దుస్థితికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. విశ్లేషకులు ఈ పరిస్థితిని జీవన ప్రమాణాల మెరుగుదల విషయంలో 'కోల్పోయిన దశాబ్దం'గా అభివర్ణిస్తున్నారు. గత రెండు సర్వేల మధ్య కాలంలో ద్రవ్యోల్బణాన్ని సర్దుబాటు చేసిన తర్వాత చూస్తే, సగటు కుటుంబ ఆదాయాలు, వినియోగం గణనీయంగా తగ్గినట్లు నివేదిక పేర్కొంది. ఆర్థిక వృద్ధి సానుకూలంగా ఉన్నప్పటికీ, పేదరికం పెరగడం ఆందోళన కలిగించే అంశం. ఈ వృద్ధి ఫలాలు ఎక్కువగా ఉన్నత ఆదాయ వర్గాలకే చేరాయని, దిగువ ఆదాయ వర్గాల వాస్తవ ఆదాయాలు, కొనుగోలు శక్తి తీవ్రంగా దెబ్బతిన్నాయని ఇది సూచిస్తోంది. పేద కుటుంబాలు ఎక్కువగా రోజువారీ వేతనాలపై ఆధారపడతాయి. అధిక ద్రవ్యోల్బణం, ఆర్థిక అంతరాయాల వల్ల ఈ వర్గాలే ఎక్కువగా నష్టపోయాయి. మరోవైపు, సంపన్న వర్గాలు రియల్ ఎస్టేట్, ఆర్థిక పెట్టుబడుల వంటి ఆస్తులను కలిగి ఉండటంతో, ధరల పెరుగుదల ప్రభావాన్ని తట్టుకోగలిగారు. దీంతో దేశంలో ఆదాయ అసమానతలు మరింత పెరిగాయి. ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, బాహ్య ఆర్థికపరమైన రిస్కుల మధ్య, పెరుగుతున్న పేదరికాన్ని, విస్తరిస్తున్న అసమానతలను పరిష్కరిస్తూనే ఆర్థిక వృద్ధిని కొనసాగించడం పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థకు పెను సవాలుగా మారింది.

## స్కైరూట్ విజయం వేళ.. రాహుల్ వయసుపై ప్రధాని మోదీ చురకలు

మొదటిపేజీ తరువాయి – ప్రయోగించిన హైదరాబాద్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్'ను అభినందిస్తూనే, రాహుల్ గాంధీ వయసును ఉద్దేశించి ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం పార్లమెంట్ సమావేశాల సందర్భంగా మీడియాతో మాట్లాడిన ప్రధాని, దేశం సాధించిన ఇటీవలి విజయాలను ప్రస్తావించారు. "భారత్ నుంచి తొలి ప్రైవేట్ రాకెట్‌ను ప్రయోగించిన స్కైరూట్ స్టార్టప్ బృందం సగటు వయసు కేవలం 28 ఏళ్లేనని నాకు తెలిసింది. ఇంతటి అతి పిన్న వయస్కులు ఈ ఘనతను సాధించారు. నేను ఇక్కడ 56 ఏళ్ల 'యువకుడి' గురించి మాట్లాడటం లేదు... రోదసిలో త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించిన 28 ఏళ్ల యువత గురించి మాట్లాడుతున్నాను" అని మోదీ పేర్కొన్నారు. జూన్ మాసంలో 56వ ఏట అడుగుపెట్టిన రాహుల్ గాంధీని ఉద్దేశించే ప్రధాని ఈ వ్యాఖ్యలు చేసినట్లు స్పష్టమవుతోంది. హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ శనివారం 'విక్రమ్-1' రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన సంగతి తెలిసిందే. ఈ ప్రయోగం ద్వారా అమెరికా, చైనాల తర్వాత ప్రైవేట్ ఆర్బిటల్ ప్రయోగ సామర్థ్యాలను కలిగిన మూడో దేశంగా భారత్ రికార్డు సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా కేవలం కొన్ని దేశాలకు మాత్రమే పరిమితమైన ఈ ఘనతను భారత యువత సాధించడం దేశానికే గర్వకారణమని మోదీ కొనియాడారు. గత ఏడాది వర్షాకాల సమావేశాల కంటే ముందు ఓ భారత పౌరుడు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న అంశాన్ని కూడా ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పార్లమెంట్ సమావేశాలు అర్థవంతంగా, ఫలప్రదంగా సాగాలని, ప్రజా సమస్యలపై లోతైన చర్చలు జరగాలని ఆయన ఆకాంక్షించారు.

## పశ్చిమాసియా యుద్ధంలో మునిగిన ప్రపంచం



మొదటిపేజీ తరువాయి – నెట్టేసింది. అమెరికా వైమానిక దాడులు, ఇరాన్ ప్రతీకార దాడుల నడుమ హర్మూజ్ జలసంధి ద్వారా చమురు రవాణా ప్రస్తుతం యుద్ధానికి ముందు నాటితో పోలిస్తే సుమారు మూడింట రెండు వంతులకు చేరుకుందని ట్రంప్ ప్రభుత్వం తెలిపింది. అదే సమయంలో, ఇరాన్ ఈ ఘర్షణను మరింత విస్తృతం చేస్తూ సూయజ్ కాలువకు కూడా ముప్పు తలపెట్టే అవకాశం ఉందని నాటో మాజీ కమాండర్ హెచ్చరించారు. హర్మూజ్ జలసంధి ద్వారా రవాణా పూర్తిగా స్తంభించిపోయిందనే వార్తలను అమెరికా ఇంధన శాఖ మంత్రి క్రిస్ రైట్ తోసిపుచ్చారు. ప్రస్తుత సగటు ప్రకారం ఈ జలసంధి ద్వారా రోజుకు 70 మిలియన్ బారెళ్ల చమురు, బైపాస్ పైప్‌లైన్ల ద్వారా మరో 70 మిలియన్ బారెళ్ల చమురు సరఫరా అవుతోందని ఆయన వెల్లడించారు. గల్ఫ్ ప్రాంతం నుండి మొత్తం 140 మిలియన్ బారెళ్ల సరఫరా జరుగుతోందని, ఇది గత మార్చి నెలతో పోలిస్తే గణనీయంగా పెరిగిందని చెప్పారు. ఓడల సంఖ్య తగ్గినప్పటికీ, ప్రపంచ మార్కెట్‌కు కొరత లేకుండా చూడటానికి పెద్ద ట్యాంకర్లను ఉపయోగిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరంపై ఇరాన్ జరిపిన దాడిలో ఇద్దరు అమెరికా సైనికులు మరణించగా, మరొకరు గల్లంతయ్యారు. దీనికి ప్రతికారంగా అమెరికా దళాలు ఇరాన్‌పై సరికొత్త దాడులు జరిపాయి. ఇరాన్ సహకారం ఉన్నా లేకపోయినా ఈ జలసంధి ద్వారా రవాణాకు రక్షణ కల్పిస్తామని అమెరికా పేర్కొంది. అయితే డెమొక్రాటిక్ సెనేటర్ మార్క్ వార్నర్ ఈ అంచనాలను తప్పుపట్టారు. యుద్ధం కారణంగా వర్జీనియాలో పెట్రోల్ ధర గాలన్‌కు 2.81 డాలర్ల నుండి 4 డాలర్లకు, డీజిల్ ధర 5 డాలర్లకు పెరిగిందని, ఈ యుద్ధం ఒక పెద్ద విపత్తు అని ఆయన విమర్శించారు. నాటో మాజీ సుప్రీం అలైడ్ కమాండర్, రిటైర్డ్ అడ్మిరల్ జేమ్స్ స్టావ్రిడిస్ ఇరాన్ తదుపరి వ్యూహంపై సంచలన హెచ్చరికలు చేశారు. హర్మూజ్ జలసంధి మాత్రమే కాకుండా, పశ్చిమ ప్రాంతంలో ఉన్న హౌతీ తిరుగుబాటుదారులను వాడుకుని సూయజ్ కాలువను మూసివేయడానికి ఇరాన్ ప్రయత్నిస్తోందని అన్నారు. ఎర్రసముద్రం ఉత్తర సరిహద్దుకు సమీపంలో ఉన్న జోర్డాన్‌పై ఇటీవల జరిగిన దాడులకు, ఈ వ్యూహానికి సంబంధం ఉండవచ్చని ఆయన విశ్లేషించారు. ఇరాన్ కనుక సూయజ్ కాలువను అడ్డుకుంటే ప్రపంచ వాణిజ్యం కోలుకోలేని దెబ్బతింటుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## 22ఏ భూములపై సర్కార్ కీలక నిర్ణయం



తెలంగాణలో సెక్షన్ 22-ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ జాబితాకు సంబంధించి భూ యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పెండింగ్ విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కరించేందుకు హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. దీనిపై ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ముగ్గురు ఉన్నతాధికారులతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్‌ను కమిటీ ఛైర్మన్‌గా నియమించారు. లా సెక్రటరీ పాపిరెడ్డి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా ఉంటారు. 22-ఏ నిషేధిత భూముల జాబితాలో ఉన్న అంశాలను కమిటీ సమగ్రంగా పరిశీలించనుంది. భూ యజమానులు ఎదుర్కొంటున్న క్షేత్రస్థాయి సమస్యలు, వారి విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కారానికి అవసరమైన కార్యాచరణను రూపొందించనుంది. ఏళ్లుగా నిషేధిత జాబితాలో భూములు ఉండటంతో వాటి క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్ల విషయంలో పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీపై భూ యజమానుల్లో ఆశలు నెలకొన్నాయి. సమస్యలను వేగంగా పరిశీలించి పరిష్కారం చూపే దిశగా కమిటీ పనిచేయనుంది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ నిర్ణయాన్ని ప్రకటించగా, తాజాగా ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

# యువతకు బంగారు పునాదులు వేస్తున్నాం

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

మాది జెన్ జీ పక్షపాతి ప్రభుత్వం

2029 నాటికి 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం

ఏటా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ

ఈ ఏడాది 10,060కు పైగా పోస్టుల భర్తీకి నిర్ణయం

పరిశ్రమల ఏర్పాటుతో స్థానికంగానే ఉద్యోగాల కల్పన

యువత కోసం రేయింబవళ్లు శ్రమిస్తున్న సీఎం చంద్రబాబు

నిరుద్యోగులను మోసగించిన జగన్

యువత లక్ష్యాలను సాధించాలి : మంత్రి సవిత

పెనుకొండలో ఘనంగా 'యువత భవితకు భరోసా'













**పెనుకొండ/శ్రీసత్యసాయి నిజం న్యూస్,సెప్టెంబర్ 18:** ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను జగన్ మోసగిస్తే, ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి, రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తూ రాష్ట్ర యువతకు బంగారు పునాదులు వేస్తున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. తమది జెన్ జీ ప్రభుత్వమని, చదువుకున్న యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. నైపుణ్యం పోర్టల్ ను ఏర్పాటు చేసి, అందులో నిరుద్యోగ యువతకు అవసరమయ్యే ఉద్యోగావకాశాలు, స్కిల్ పెంచుకునే వివరాలు పొందుపర్చామన్నారు. యువశక్తితో 2047 నాటికి ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలబెడతామని ధీమా వ్యక్తంచేశారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యువత భవితకు భరోసా కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఆమె తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. చదువులు పూర్తికాగానే యువతకు ఉద్యోగాలు లభించేలా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ రేయింబవళ్లు కృషి చేస్తున్నారన్నారు. కేవలం రెండేళ్ల కాలంలో ఏపీకి రూ.25 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ పరిశ్రమలు ఏర్పాటు చేసి, స్థానికంగానే ఉద్యోగాలు లభించేలా చర్యలు తీసుకొంటున్నారని మంత్రి సవిత తెలిపారు. ఏటా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ: యువతకు ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటోందని మంత్రి సవిత తెలిపారు. ఈ ఏడాది 10,060 పోస్టుల భర్తీకి జాబ్ క్యాలెండర్ ను మంత్రి లోకేశ్ విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు. దీనిలో భాగంగా ఇటీవల ఏపీపీఎస్సీ ద్వారా 892 ఉద్యోగాలు, పోలీస్ డిపార్ట్ మెంట్ లో 2,050 పోస్టులు, అగ్నిమాక డిపార్ట్ మెంట్ లో 147 డ్రైవర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. మూడు వేల టీచర్ పోస్టుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నారన్నారు. రాబోయే మూడేళ్లలో మూడు డీఎస్సీలునిర్వహించనున్నామని తెలిపారు. ఇకపై ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి, ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని, యువత బంగారు పునాదులు వేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. నిరుద్యోగులను మోసగించిన జగన్: ఏటా జాబ్ క్యాలెంటర్, డీఎస్సీ నిర్వహిస్తామంటూ అధికారంలోకి వచ్చిన జగన్ మాట తప్పి నిరుద్యోగులను మోసగించారని మంత్రి సవిత మండిపడ్డారు. అయిదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేని అసమర్థుడు జగన్ అని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, మెగా డీఎస్సీని మంత్రి నారా లోకేశ్ ఎంతో పారదర్శకంగా, అక్రమాలకు తావులేకుండా నిర్వహించారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలివ్వడం ఓర్చుకోలేని జగన్... మెగా డీఎస్సీ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మాది జెన్ జీ పక్షపాతి ప్రభుత్వం: అంతకుముందు మంత్రి సవిత... పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాల నిర్దేశించుకుని, వాటిని సాధించాలని సూచించారు. యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఉందన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం గర్వపడేలా ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అవసరం మేరకే సెల్ ఫోన్లు ఉపయోగించాలని తెలిపారు. నైపుణ్యం పోర్టల్ ను ఏర్పాటు చేసి అందులో ఉద్యోగ అవకాశాలు, స్కిల్ పెంచునే విధానాలను పొందుపర్చామని, తమది జెన్ జీ పక్షపాత ప్రభుత్వమని మంత్రి సవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గోపాలపురం అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు...





**నిజం న్యూస్,సెప్టెంబర్ 18:** గోపాలపురం గ్రామాన్ని తన సొంత గ్రామంలాగే చూస్తానని, గోపాలపురం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. గోపాలపురంలో శుక్రవారం ఆయన ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 712 వినతులు అందాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామంలో సిసి రోడ్లు, డ్రైన్లు నిర్మాణం జరిగిందన్నారు. ఇంకా చేయాల్సినవి ఉన్నాయని ఎక్కువ నిధులు ఈ గ్రామానికి తీసుకువచ్చి వాటన్నిటిని పూర్తి చేయడానికి కృషి చేస్తానన్నారు. గతంలో మొదలుపెట్టిన కమ్యూనిటీ హాల్ నిర్మాణాలు ఇంకా పూర్తి కాకుండా ఉన్నాయని వాటిని పూర్తి చేస్తామన్నారు. ఈ సంవత్సరం కనీసం రెండు కమ్యూనిటీ హాల్ నిర్మాణాలు అన్నా పూర్తి చేస్తామన్నారు. స్థానిక సంస్థల్లో ఎన్డీఏ కూటమి నేతలని గెలిపించుకోవడం ద్వారా ఆ నిధుల ద్వారా గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. కల్వర్టు, పుష్కర ఘాట్లు నిర్మాణం చేపడతామన్నారు. గోపాలపురం గ్రామంలో ఇన్ని సమస్యలు ఉంటాయని అనుకోలేదన్నారు. గతంలో శాసనసభ్యులుగా పనిచేసిన వారు ఈ గ్రామంలో ఉండడంతో పలు సమస్యలు పరిష్కరించి ఉంటారని అనుకున్నానన్నారు. అయితే గ్రామంలో అనేక సమస్యలు నెలకొని ఉన్నాయని ఈరోజు ప్రజాదర్బార్ నిర్వహించిన తర్వాత తెలిసిందన్నారు. గ్రామంలో ఉన్న ఉమ్మడి సమస్యల పరిష్కారంతోపాటు వ్యక్తిగతంగా పెన్షన్లు, ఇళ్ల స్థలాలు మొదలైన సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. అర్హులందరికీ పింఛన్లు, ఇళ్ల స్థలాలు అందించడం జరుగుతుందన్నారు.

## నీటి కోసం ఇక ఇబ్బందులు వద్దు!"

18వ వార్డులో నూతన హ్యాండ్‌బోర్‌కు శంకుస్థాపన

ప్రజల దాహం తీర్చడమే లక్ష్యం.. అవసరమైన ప్రాంతాల్లో తాగునీటి వసతుల విస్తరణ

ప్రజా సమస్యలకు ప్రాధాన్యత.. మౌలిక వసతుల కల్పనకు చర్యలు



**జగ్గయ్యపేట:నిజం న్యూస్,సెప్టెంబర్ 18:** తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడకూడదనే లక్ష్యంతో జగ్గయ్యపేట మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా 18వ వార్డులో నూతన హ్యాండ్‌బోర్ ఏర్పాటు పనులకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర శంకుస్థాపన చేశారు. తాగునీరు.. ప్రతి కుటుంబానికి ప్రాథమిక అవసరం ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ.. ప్రజలకు తాగునీరు అందుబాటులో ఉండటం అత్యంత ప్రాథమిక అవసరమని అన్నారు. పట్టణంలోని అవసరమైన ప్రాంతాలను గుర్తించి నూతన హ్యాండ్‌బోర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. "నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడకూడదు. స్థానికంగా ఉన్న తాగునీటి సమస్యలను గుర్తించి, వాటికి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపించడమే లక్ష్యం" అని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల సమస్యే.. అభివృద్ధికి ప్రాధాన్యత మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు మున్సిపాలిటీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, డ్రైనేజీ వంటి ప్రజల రోజువారీ జీవితానికి అవసరమైన సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు."ప్రజల నుంచి వచ్చే సమస్యలను గుర్తించి.. వాటికి పరిష్కారం చూపించడమే స్థానిక సంస్థల ప్రధాన బాధ్యత" అని ఆయన పేర్కొన్నారు.

### ఒక్క హ్యాండ్‌బోర్.. ఎన్నో కుటుంబాలకు ఉపయోగం

18వ వార్డులో ఏర్పాటు చేస్తున్న నూతన హ్యాండ్‌బోర్ స్థానిక ప్రజలకు తాగునీటి సౌకర్యాన్ని మరింత మెరుగుపరచడంలో ఉపయోగపడనుంది. ముఖ్యంగా నీటి అవసరం అధికంగా ఉండే కాలంలో స్థానికంగా అదనపు నీటి వనరు అందుబాటులో ఉండటం ప్రజలకు ఉపశమనం కలిగించనుంది. తమ ప్రాంతంలో తాగునీటి సదుపాయం కోసం చేపట్టిన చర్యలపై వార్డు ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక వసతులు కల్పించడంపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని కోరారు. ప్రజలకు విజ్ఞప్తి ప్రజలకు అందుబాటులోకి వచ్చే తాగునీటి వనరులను ప్రతి ఒక్కరూ బాధ్యతగా వినియోగించాలని, నీటిని వృథా చేయకుండా "నీరు ఉంటేనే జీవనం.. నీటిని కాపాడితేనే భవిష్యత్తు" అనే అవగాహనతో వ్యవహరించాలని స్థానికులు సూచిస్తున్నారు. తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను ప్రజలు సంబంధితమున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, అందుబాటు లో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు ఈ కార్యక్రమంలో 18వ వార్డు కౌన్సిలర్ సంగేపు బుజ్జి, మున్సిపల్ డీఈ శివ కోటేశ్వరరావు, మీసాల బాబులు, పితాని శ్రీనాథ్, రాము, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు. ప్రజల మాటే.. అభివృద్ధికి బాట!తాగునీరు, రహదారి, పారిశుధ్యం వంటి ప్రాథమిక అవసరాలు అందుబాటులో ఉన్నప్పుడే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. స్థానిక సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడం.. పరిష్కారం వచ్చే వరకు ప్రజలు బాధ్యతాయుతంగా పర్యవేక్షించడం.. పట్టణ అభివృద్ధిలో ప్రతి పౌరుడి భాగస్వామ్యాన్ని పెంచుతుంది.

## శ్రీ సాయి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కళా జాత ప్రోగ్రాం హెచ్ఐవి ఎయిడ్స్ అవగాహన సదస్సు



**ఉమ్మడి నల్లగొండ జిల్లా నిజం న్యూస్,సెప్టెంబర్ 18:** రామన్నపేట మండల కేంద్రంలో హెచ్ఐవి పట్ల అవగాహన కార్యక్రమం హెచ్ఐవి అనేది ఇది అంటూ వ్యాధి కాదు మనం కావాలని అంటించుకుంటేనే వ్యాపించే వ్యాధి హెచ్ఐవి వచ్చిన వారితో మనము కలిసి మెలిసి ఉండవచ్చు, అట్లాగే షేక్ అండ్ ముద్దు కుడా పెట్టవచ్చు, హెచ్ఐవి అనేది ఒక రక్తం ద్వారానే వ్యాపిస్తుంది, హెచ్ఐవి సోకిన వ్యక్తులతో మనము చిన్న చూపు చూడకూడదు, అట్లాగే హెచ్ఐవి నాలుగు రకాలుగా వ్యాపిస్తుంది, అసురక్షిత లైంగికల ద్వారా, రక్త మార్పిడి ద్వారా, కలుషిత సూదులు సిరంజల ద్వారా, గర్భవతి అయిన తల్లి నుండి బిడ్డకు వ్యాపిస్తుంది, అని ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది,ఈ కార్యక్రమంలో రామన్నపేట ఐసిటిసి కౌన్సిలర్ పెరిక సైదులు, రామన్నపేట క్లస్టర్ లింక్ వర్కర్ మేడి ముకుంద, రామన్నపేట వార్డు మెంబర్స్ శేఖర్ కరోబార్, నకిరేకంటి రాము, గొరిగ సోములు, బాలరాజు, హనుమంతు, గ్రామ తదితరులు ప్రజానీకం,తదితరులు పాల్గొన్నారు.

## కోనేరు ఆక్రమణలు తొలగించాలి.. పవిత్రతను కాపాడాలి!

హైకోర్టు ఆదేశాలను అమలు చేయడంలో జాప్యం ఎందుకు?

కోనేరు పరిరక్షణ దీక్షకు క్లాత్ మర్చంట్ అసోసియేషన్ సంఘీభావం

అధికారులు స్పందించకపోతే నందిగామ బంద్‌కు సిద్ధం: అనుమోలు వెంకట శ్రీనివాసరావు



**నిజం న్యూస్,సెప్టెంబర్ 18:** తరతరాలుగా ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచిన శివాలయ కోనేరు ఆక్రమణల నుంచి విముక్తి పొందే వరకుపోరాటం కొనసాగుతుందని క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు అనుమోలు వెంకట శ్రీనివాసరావు అన్నారు. కోనేరు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరాహార దీక్షలకు శుక్రవారం అసోసియేషన్ సభ్యులు సంఘీభావం తెలిపి దీక్షలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వెంకట శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పవిత్రమైన కోనేరు స్థలాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. కోనేరు ఆక్రమణలపై హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు వాటి అమలులో జాప్యం చేయడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా తగిన చర్యలు లేకపోవడం బాధాకరమన్నారు. కోర్టు ఆదేశాలు అమలు చేయాల్సిందే ప్రజా ప్రయోజ నాలకు సంబంధించిన అంశంలో అధికార యంత్రాంగం కాలయాపన చేయకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. హైకోర్టు ఆదేశాలను గౌరవించి, కోనేరు స్థలాన్ని ఆక్రమణల నుంచి శాశ్వతంగా విముక్తి చేయాలని కోరారు. "కోనేరు పరిరక్షణ విషయంలో అధికారులు ఇకనైనా స్పందించాలి. సమస్యను మరింత కాలం పెండింగ్‌లో ఉంచితే ప్రజా ఉద్యమం మరింత విస్తృతమవుతుంది" అని ఆయన పేర్కొన్నారు.

### నిరుపేదలకు న్యాయం.. కోనేరు స్థలానికి విముక్తి

కోనేరు స్థలంలో నివసిస్తున్న నిరుపేద కుటుంబాల సమస్యను కూడా మానవతా దృక్పథంతో పరిష్కరించాలని అసోసియేషన్ కోరింది. వారికి ప్రభుత్వం ప్రత్యామ్నాయ స్థలాలు లేదా పునరావాస సౌకర్యాలు కల్పించి, అనంతరం కోనేరు స్థలాన్ని ఖాళీ చేయించే చర్యలు చేపట్టాలని సూచించింది. దీంతో ఒకవైపు నిరుపేద కుటుంబాలకు న్యాయం జరిగేలా, మరోవైపు పవిత్ర కోనేరు పరిరక్షించబడేలా ప్రభుత్వం సమగ్ర పరిష్కారం చూపాలని కోరారు.

### తెప్పోత్సవం, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు పునర్వైభవం

కోనేరు ఆక్రమణలు తొలగించి, కోనేరు అభివృద్ధికి చర్యలు తీసుకుంటే భవిష్యత్‌లో శ్రీవారి తెప్పోత్సవం, ఇతర విశేష ఆధ్యాత్మిక కార్యక్రమాలను వైభవంగా నిర్వహించుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలను గౌరవించి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. "జాప్యం చేస్తే ఉద్యమం ఉధృతం"కోనేరు ఆక్రమణ లను తొలగించడంలో ప్రభుత్వం ఇంకా జాప్యం చేస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వెంకట శ్రీనివాసరావు హెచ్చరించారు. అవసరమైతే నందిగామ పట్టణ బంద్‌కు పిలుపునిచ్చి ప్రజలను సమీకరించి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.

### దీక్షకు విస్తృత సంఘీభావం

దీక్షా శిబిరంలో ది క్లాత్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు అనుమోలు వెంకట శ్రీనివాసరావు, చవట పాప, మహంకాళి వెంకటేశ్వరరావు, చవట నవీన్, ఏచూరి నాగరాజు, తాతా సంతోష్, లింగమల్లు నాగేశ్వరరావు, నకరికంటి శ్రీనివాసరావు, మహంకాళి లక్ష్మీనారాయణ, గోపు సుధాకర్, మహంకాళి ప్రసాద్, పి.సుభాని, మణి, చవట సురేష్, మారం లక్ష్మీనరసింహ, పాదర్తి విశ్వేశ్వరరావు, పారేపల్లి బెనర్జీ, చేజర్ల గోపీనాథ్, చవట సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.పట్టణ ప్రముఖులు, హిందూ భక్తులు, వివిధ వ్యాపార వర్గాల ప్రతినిధులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. కోనేరు పరిరక్షణకు ప్రజలంతా ఐక్యంగా నిలిచి, సమస్యకు శాశ్వత పరిష్కారం వచ్చేలా ప్రభుత్వంపైబాధ్యతా యుతంగా ఒత్తిడి తీసుకురావాలని వారు కోరారు.

## నూతన పింఛన్ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా చర్యలు

అర్హత కలిగిన ప్రతి దరఖాస్తును నిబంధనల మేరకు పరిశీలించి ఆన్‌లైన్‌లో అప్రూవ్ చేయాలి.

పింఛన్ మంజూరు కోసం లబ్ధిదారుల నుంచి డబ్బులు డిమాండ్ చేసినా,ఉద్దేశపూర్వకంగా జాప్యం చేసినా కఠిన చర్యలు.

స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బంది పనితీరును ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు నిరంతరం పర్యవేక్షించాలి.

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

**విజయవాడ: నిజం న్యూస్,సెప్టెంబర్ 18:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సామాజిక భద్రతా పింఛన్ పథకంలో భాగంగా పెంచిన పింఛన్ మొత్తాలను లబ్ధిదారులకు అందజేయడంతో పాటు, నూతనంగా అర్హత పొందిన వారికి పింఛన్లు మంజూరు చేసేందుకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. చందర్లపాడులో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్తున్న సందర్భంలో మార్గమధ్యంలో సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, జిల్లాలో నూతన పింఛన్ దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, ఆన్‌లైన్ అప్రూవల్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. నూతన పింఛన్ దరఖాస్తుల స్వీకరణకు సెప్టెంబర్ 18వ తేదీతో గడువు ముగియనున్న నేపథ్యంలో, ఇప్పటివరకు స్వీకరించిన దరఖాస్తుల పరిశీలనను పూర్తిచేసి, నిబంధనల మేరకు అర్హత కలిగిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్రూవ్ చేసే ప్రక్రియను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి జాప్యానికి అవకాశం ఇవ్వకుండా క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. నూతన పింఛన్ దరఖాస్తుల పరిష్కారం లేదా ఆన్‌లైన్ అప్రూవల్ కోసం లబ్ధిదారుల నుంచి ఎటువంటి రుసుములు, డబ్బులు డిమాండ్ చేయరాదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. లబ్ధిదారుల నుంచి డబ్బులు ఆశించడం, దరఖాస్తుల పరిష్కారంలో ఉద్దేశపూర్వకంగా జాప్యం చేయడం, అధికారిక ప్రక్రియను వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం లేదా "పింఛన్ నేనే చేయాలి.. నేను చేయకపోతే అవ్వదు" అనే విధంగా వ్యవహరించడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. ఇటువంటి చర్యలకు పాల్పడినట్లు నిర్ధారణ అయితే సంబంధిత సిబ్బందిపై నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన అర్హత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ప్రతి దరఖాస్తును నిబంధనల మేరకు పరిశీలించి, అర్హత ఉన్న లబ్ధిదారులకు పింఛన్ ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అర్హత కలిగిన ఏ ఒక్క లబ్ధిదారుడు కూడా అనవసర కారణాలతో పింఛన్ ప్రయోజనం కోల్పోకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అదే సమయంలో, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అర్హత లేని దరఖాస్తులను నిబంధనల ప్రకారం మాత్రమే పరిష్కరించాలని, మొత్తం ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నూతన పింఛన్ దరఖాస్తుల పరిశీలన, ఆన్‌లైన్ అప్రూవల్ ప్రక్రియలో స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బంది కీలక బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలోని స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. దరఖాస్తుల పురోగతి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, అర్హత నిర్ధారణ, ఆన్‌లైన్ అప్రూవల్ తదితర అంశాలను క్రమం తప్పకుండా సమీక్షించి, సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. నూతన పింఛన్ దరఖాస్తుల పరిష్కారంలో అర్హులైన లబ్ధిదారుల ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్హత కలిగిన ఏ ఒక్క దరఖాస్తు కూడా నిర్లక్ష్యం కారణంగా పెండింగ్‌లో ఉండకూడదని, అర్హత ఉన్నప్పటికీ అనవసరంగా తిరస్కరణకు గురికాకూడదని స్పష్టం చేశారు. అర్హులైన లబ్ధిదారుల దరఖాస్తులను నిబంధనల మేరకు సకాలంలో పరిష్కరించడంలో విఫలమయ్యే సిబ్బందిపై బాధ్యతను నిర్ధారించి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం ఒక కుటుంబంలో అర్హత కలిగిన ఒక్క లబ్ధిదారుడికి మాత్రమే పింఛన్ పొందే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. భవిష్యత్‌లో ఒకే కుటుంబంలో అర్హత కలిగిన ఇతర సభ్యులకు కూడా పింఛన్ మంజూరు చేసే అంశంపై ప్రభుత్వం పరిశీలనలో ఉంచినట్లు ఈ సందర్భంగా తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం ప్రతి కుటుంబంలో అర్హత కలిగిన ఒక లబ్ధిదారుడికి పింఛన్ ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నూతన పింఛన్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారులు కూడా నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారులు, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారులు, సంబంధిత ఇతర అధికారులు పాల్గొన్నారు.





# పీరియాడిక్ డ్రామాతో మలయాళ క్రేజీ స్టార్!

**విబిన్నమైన క్రైమ్ కామెడీ యాక్షన్ డ్రామాలతో దక్షిణాది ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంటున్న మలయాళ ఇండస్ట్రీలో యంగ్ స్టార్ టొవినోథామస్ ప్రత్యేక గుర్తింపుని సొంతం చేసుకున్నాడు.**

మలయాళ ఇండస్ట్రీ కథబలమున్న సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన విషయం తెలిసిందే. విబిన్నమైన క్రైమ్ కామెడీ యాక్షన్ డ్రామాలతో దక్షిణాది ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంటున్న మలయాళ ఇండస్ట్రీలో యంగ్ స్టార్ టొవినోథామస్ ప్రత్యేక గుర్తింపుని సొంతం చేసుకున్నాడు. సూపర్ హీరో స్టోరీతో చేసిన -మిన్నల్ మురళీ-, కేరళ వరదల నేపథ్యంలో తెరకెక్కిన -2018-, యాక్షన్ అడ్వెంచర్ మూవీ -ఏఆర్ ఎమ్, స్కై మార్వల్ యాక్షన్ థ్రిల్లర్ -ఐడెంటిటీ-, లోక చంద్ర చాప్టర్ 1- వంటి విభిన్నమైన సినిమాలతో మలయాళంతో పాటు తెలుగు, తమిళ భాషల్లోనూ మంచి పేరు తెచ్చుకున్నాడు. ాశ్రీంశీ =ఖుం - తెలంగాణలో టికెట్ ధరల పెంపు.. హైకోర్టు 90 రోజుల రూల్.. ఎప్పుడూ విభిన్నమైన కథలు ఎంచుకుంటూ కొత్త తరహా సినిమాలకు శ్రీకారం చుట్టే టొవినో థామస్ ఇప్పడు మరో పీరియాడిక్ యాక్షన్ డ్రామాకు తెరలేపాడు. అదే -పల్లి చట్టంబి-. డిజో జోస్ ఆంటోనీ దర్శకుడు. -జన గన మన-, మలయాళీ ఫ్రమ్ ఇండియా వంటి సినిమాలతో దర్శకుడిగా మంచి గుర్తింపుని సొంతం చేసుకున్న డిజో జోస్ ఆంటోనీ ఈ సారి 1950, 1960ల నేపథ్యంలో సాగే కథని ఎంచుకుని టివినో థామస్‌తో ఈ మూవీని చేస్తున్నాడు. పాన్ ఇండియా వైడ్‌గా భారీ స్థాయిలో రిలీజ్‌కు రెడీ అవుతున్న మూవీ ఇది. ాశ్రీంశీ =ఖుం - ఫోటోటాక్ : లవ్లీ బ్యూటీ మిర్రర్ షో అదుర్స్ దీన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నౌఫల్, బ్రిజేష్, చాణక్య చైతన్య చరణ్ నిర్మిస్తున్నారు. కయదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తోంది. జేక్స్ బిజాయ్ సంగీతం అందిస్తున్న ఈ మూవీ మోషన్ పోస్టర్‌ని తాజాగా టీమ్ విడుదల చేసింది. టొవినో వాయిస్‌తో మొద లైన మోషన్ పోస్టర్ విశేషంగా ఆకట్టుకుంటోంది. వైట్ లుంగీ, మెరూన్ కలర్ షర్ట్ ధరించి, బారు మీసాలతో టొవినో పవర్‌ఫుల్ లుక్‌లో కనిపిస్తున్న తీరు సినిమాకు మంచి క్రేజ్‌ని తెచ్చి పెడుతోంది. మోషన్ పోస్టర్‌లోని విజువల్స్ చూస్తుంటే -పల్లి చట్టంబి- మరో కంటెంట్ డ్రివెన్ మూవీ అని స్పష్టం చేస్తోంది. ాశ్రీంశీ =ఖుం - సంక్రాంతి విన్నర్స్: బ్రేక్ ఈవెన్ ఎన్ని రోజుల్లో ఫినిష్ చేశారంటే.. 1950,1960 నేపథ్యంలో సాగే కథగా దీన్ని దర్శకుడు డిజో జోస్ ఆంటోనీ తెరకెక్కిస్తున్నట్టుగా తెలుస్తోంది. మోషన్ పోస్టర్‌లో టొవినో సీరియస్ లుక్, తన స్క్రీన్ ప్రజెన్స్ మూవీపై అంచనాల్ని పెంచేస్తోంది. పైగా ఈ మూవీని మలయాళంతో పాటు తమిళ, తెలుగు, కన్నడ, హిందీ భాషల్లోనూ భారీ స్థాయిలో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. సరికొత్త నేపథ్యంలో కంటెంట్ ప్రధానంగా రూపొందుతున్న ఈ మూవీ రిలీజ్ డేట్‌ని కూడా మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 9న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ చేస్తున్నారు.

# బ్రేక్ ఈవెన్ ఎన్ని రోజుల్లో ఫినిష్ చేశారంటే..

**ఈ ఏడాది సంక్రాంతి బాక్సాఫీస్ వద్ద తెలుగు సినిమాలు కాసుల వర్షం కురిపించాయి. పెద్ద హీరోలతో పాటు మీడియం రేంజ్ హీరోలు కూడా తమ సత్తా చాటుతూ ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచారు.**



సంక్రాంతి విన్నర్స్: బ్రేక్ ఈవెన్ ఎన్ని రోజుల్లో ఫినిష్ చేశారంటే..ఈ ఏడాది సంక్రాంతి బాక్సాఫీస్ వద్ద తెలుగు సినిమాలు కాసుల వర్షం కురిపించాయి. పెద్ద హీరోలతో పాటు మీడియం రేంజ్ హీరోలు కూడా తమ సత్తా చాటుతూ ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచారు. పండుగ సెలవులను పక్కాగా వాడుకుంటూ, విడుదలైన వారం రోజుల్లోనే మెజారిటీ సినిమాలు సేఫ్ జోన్‌లోకి వచ్చేయడం విశేషం. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, ప్రస్తుత కలెక్షన్ల ట్రెండ్ చూస్తుంటే సంక్రాంతి విన్నర్స్ ఎవరనేది క్లియర్‌గా అర్థమవుతోంది.ముందుగా మెగాస్టార్ చిరంజీవి 'మన శంకరవరప్రసాద్ గారు' బాక్సాఫీస్ వద్ద ఊరమాస్ విధ్వంసం సృష్టించింది. ఈ సినిమా సుమారు 122 కోట్ల బ్రేక్ ఈవెన్ టార్గెట్‌తో బరిలోకి దిగగా, కేవలం 6 రోజుల్లోనే ఆ మార్కును దాటేసింది. దాదాపు 26.93 కోట్ల లాభాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. వింటేజ్ చిరు కామెడీకి ఆడియన్స్ బ్రహ్మరథం పడుతుండటంతో లాంగ్ రన్ లో ఈ లెక్క ఇంకా పెరిగే అవకాశం ఉంది.ఇక ఈ సంక్రాంతికి అసలైన ట్విస్ట్ ఇచ్చింది నవీన్ పొలిశెట్టి సినిమా. ఆయన నటించిన 'అనగనగా ఒక రాజు' కేవలం 4 రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ పూర్తి చేసుకుని అందరినీ షాక్ కు గురిచేసింది. 28 కోట్ల టార్గెట్‌తో వచ్చిన ఈ సినిమా, ఇప్పటివరకు 37.59 కోట్ల షేర్ సాధించి సూపర్ హిట్ స్టేటస్ అందుకుంది. సుమారు 9.57 కోట్ల లాభాలను ఖాతాలో వేసుకున్న నవీన్, తన కామెడీ టైమింగ్‌తో యూత్‌ను ఫ్యామిలీ ఆడియన్స్‌ను థియేటర్లకు రప్పించడంలో సక్సెస్ అయ్యారు.శర్వానంద్ నటించిన 'నారి నారి నడుమ మురారి' కూడా సైలెంట్‌గా వచ్చి డీసెంట్ హిట్‌గా నిలిచింది. 10.25 కోట్ల వాల్యూ బ్రేక్ ఈవెన్ టార్గెట్‌తో రిలీజైన ఈ సినిమా, 7 రోజుల్లో గమ్యాన్ని చేరుకుంది. ఇప్పటివరకు వరల్డ్ వైడ్ గా 11.29 కోట్ల షేర్ వసూలు చేసి, సుమారు 1.04 కోట్ల లాభంతో కొనసాగుతోంది. అన్ని ఏరియాల్లోనూ బ్రేక్ ఈవెన్ దాటేయడంతో, డిస్ట్రిబ్యూటర్లు సేఫ్ జోన్ లోకి వచ్చేశారుట్రేడ్ అనలిస్టుల సమాచారం ప్రకారం, ఈ సినిమాలన్నీ దాదాపుగా అంచనాలను అందుకున్నాయి. పక్కా కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న చిరు సినిమాకు మాస్ ఆడియన్స్, నవీన్ సినిమాకు యూత్, శర్వానంద్ సినిమాకు ఫ్యామిలీ ఆడియన్స్ తోడవ్వడం ఈ విజయాలకు ప్రధాన కారణం. గత ఏడాది సంక్రాంతితో పోలిస్తే, ఈసారి సక్సెస్ రేటు చాలా ఎక్కువగా ఉండటం ఇండస్ట్రీకి శుభపరిణామం అని చెప్పవచ్చు.ఏదేమైనా ఈ సంక్రాంతి సీజన్ ముగిసే సమయానికి బయ్యర్లంతా హ్యాపీగా ఉన్నారు. రవితేజ నటించిన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' కూడా తనదైన శైలిలో వసూళ్లను రాబడుతుండగా, ప్రభాస్ రాజాసాబ్ మాత్రం టార్గెట్ విషయంలో చాలానే వెనుకబడింది. ఆ సినిమా ఇంకా దాదాపు 40% శాతం వెనక్కి తీసుకు రావాల్సి ఉంది. ఇక మిగిలిన వర్కింగ్ డేస్‌లో ఈ సినిమాలు ఎలా హోల్డ్ చేస్తాయో చూడాలి.

# మినీ డ్రెస్ లో బుట్టబొమ్మ అందాలు!



ఇకపోతే ప్రస్తుతం ఈమె ప్రముఖ కోలీవుడ్ స్టార్ హీరో, రాజకీయ నాయకుడు విజయ్ దళపతి ఆఖరి చిత్రం 'జననాయగన్' చిత్రంలో నటిస్తోంది. దీఎ: మీఖుసష్ట్రబ =వఎఎఎ । 20 జీఖుఅ 2026 4:14ఽావీ ాష్టుతీవ: 2010లో మిస్ యూనివర్స్ ఇండియా అందాల పోటీలలో పాల్గొన్న పూజా హెగ్డే.. 2012లో వచ్చిన 'ముగమూడి' అనే తమిళ చిత్రం ద్వారా నటన రంగ ప్రవేశం చేసింది. అటు తెలుగులో 2014లో నాగచైతన్య హీరోగా నటించిన 'ఒక లైలా కోసం' అనే సినిమాలో నటించి తన పాత్రకు విమర్శకుల ప్రశంసలు అందుకుంది. అదే ఏడాది ప్రిన్స్ హీరో వరుణ్ తేజ్ తో కలిసి 'ముకుందా' అనే సినిమాలో నటించి మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది ఈ ముద్దుగుమ్మ. తెలుగులో వరుస సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న సమయంలోనే హిందీలో 2016లో హృతిక్ రోషన్ సరసన మోహెంజోదారో సినిమా ద్వారా హిందీ రంగ ప్రవేశం చేసింది. ాశ్రీంశీ =ఖుం - తెలంగాణలో టికెట్ ధరల పెంపు.. హైకోర్టు 90 రోజుల రూల్.. ఇకపోతే ప్రస్తుతం ఈమె ప్రముఖ కోలీవుడ్ స్టార్ హీరో, రాజకీయ నాయకుడు విజయ్ దళపతి ఆఖరి చిత్రం 'జననాయగన్' చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమా ఈ ఏడాది జనవరి 9వ తేదీన విడుదల కావాల్సి ఉండగా.. సెన్సార్ జాప్యం వల్ల విడుదల ఆలస్యం అవుతుంది. ఇంకా ఈ సినిమా విడుదల తేదీ పై క్లారిటీ వెలువడలేదు. మరొకవైపు ఈమెకు సంబంధించిన ఒక విషయం సోషల్ మీడియాలో వైరల్ గా మారిన విషయం తెలిసిందే. పూజ హెగ్డే మాట్లాడుతూ.. నేను ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో ఒక స్టార్ హీరో నా క్యారవాన్ లోకి వచ్చి నాపై చేయి వేశాడు. ఆ సమయంలో ఏం చేయాలో తెలియలేదు. అలా అని సైలెంట్ గా ఉండిపోలేదు. ఆ స్టార్ హీరో చెంప చెల్లుమనిపించాను. ఇక అదే సినిమాలో ఆ స్టార్ హీరో తో నాకు కొన్ని సన్నివేశాలు ఉన్నా.. డూపు పెట్టి సన్నివేశాలు కంప్లీట్ చేశాము .ఇక ఆ తర్వాత నుంచి అతడితో కలిసి నేను స్క్రీన్ షేర్ చేసుకోలేదు" అంటూ పూజా హెగ్డే తెలిపింది. అయితే ఇది ఆమె స్వయంగా తెలిపిందా లేక ఎవరైనా ఆమె ఐడి పై ఇలా కామెంట్లు చేశారా అన్న విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. ాశ్రీంశీ =ఖుం - ఫోటోటాక్ : లవ్లీ బ్యూటీ మిర్రర్ షో అదుర్స్ మరొకవైపు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పూజా హెగ్డే షేర్ చేసిన ఫోటోలు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. మినీ డ్రెస్ ధరించి మెట్లపై స్టైలిష్ లుక్ లో ఫోటోలకు ఫోజులిచ్చింది. స్టన్నింగ్ లుక్ లో పూజా హెగ్డే షేర్ చేసిన ఈ ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. బుట్టబొమ్మ ఎప్పుడూ తన అందంతో అభిమానులను ఆకట్టుకుంటుంది అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ఇకపోతే ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈమె తన ఫిట్నెస్ గురించి తాను తీసుకునే ఫుడ్ డైట్ గురించి చెప్పుకొచ్చింది. నేను ప్రతిరోజు పండ్లు తీసుకుంటాను. అలాగే రోటీ , సబ్జీ, చేపలు అంటే చాలా ఇష్టం. ముఖ్యంగా ఇంట్లో తయారు చేసింది ఏదైనా సరే నేను ఇష్టంగా తింటాను. ముఖ్యంగా నాకు పిజ్జా అంటే ఇష్టం. కానీ కాఫీ , సలాడ్ వంటివి ఇష్టం ఉండదు అంటూ పూజా హెగ్డే తెలిపింది.

# సమ్మర్ నుంచి మెగాస్టార్ బరిలోకి!

**మొత్తానికి మెగాస్టార్ చిరంజీవి ఖాతాలో**

**-మనశంకరవరప్రసాద్ గారు- తో మరో బ్లాక్ బస్టర్ జమ అయింది.**

**సమ్మర్ నుంచి మెగాస్టార్ బరిలోకి!**



మొత్తానికి మెగాస్టార్ చిరంజీవి ఖాతాలో -మనశంకరవరప్రసాద్ గారు- తో మరో బ్లాక్ బస్టర్ జమ అయింది. సంక్రాంతి కానుకగా రిలీజ్ అయిన సినిమా సక్సెస్ ఫుల్ గా దూసుకుపోతుంది. ఇప్పటికే సినిమా 200 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. చాలా చోట్ల సినిమా బ్రేక్ ఈవెన్ అయిపోయింది. దీంతో నిర్మాతలు సహా అంతా సంతోషంగా కనిపిస్తున్నారు. గ్రాండ్ గా సక్సెస్ ఈవెంట్ కూడా ప్లాన్ చేస్తున్నారు. ఈ వేసవిలో చిరంజీవి నటించిన మరో చిత్రం -విశ్వంభర- కూడా రిలీజ్ అయిపోతుంది. ఇప్పటికే రిలీజ్ అవ్వాల్సిన సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యం కారణంగా వాయిదా పడింది.

కానీ సమ్మర్ లో ఎట్టి పరిస్థితుల్లో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. మరి చిరంజీవి-శ్రీకాంత్ ఓదెల ప్రాజెక్ట్ సంగతేంటి? అంటే అందుకు సమయం ఆసన్నమవుతుంది. మార్చి లేదా ఏప్రిల్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు పెట్టాలని శ్రీకాంత్ ప్లాన్ చేస్తున్నాడు. ప్రస్తుతం శ్రీకాంత్ ఓదెల నాని హీరోగా -ది ప్యారడైజ్- తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ 70 శాతానికి పైగా పూర్తయింది. పెండింగ్ షూటింగ్ మరో రెండు నెలల్ఓ పూర్తి కానుందని సమాచారం. ఈ నేపథ్యంలోనే శ్రీకాంత్ సినిమాను లైన్ లో పెడుతున్నాడు.

ది ప్యారడైజ్ కు ముందే చిరంజీవి సినిమా ప్రకటన వచ్చింది. కానీ తాత్కలికంగా చిరు ప్రాజెక్ట్ ను పక్కనబెట్టి నానితో ముందుకెళ్లారు. చిరంజీవికి కూడా వేర్వేరు కమిట్ మెంట్లు ఉండటంతో? శ్రీకాంత్ ని హోల్డ్ లో పెట్టారు. -ది ప్యారడైజ్- ముగింపు దశకు చేరుకోవడం, చిరంజీవి నటించిన -మన శంకరవర ప్రసాద్ గారు- రిలీజ్ అవ్వ డం..-విశ్వంభర- షూటింగ్ పూర్తవ్వడంతో? తదుపరి పూర్తి చేయాల్సింది శ్రీకాంత్ ప్రాజెక్ట్ కావడంతో సంసి ద్ధమవుతున్నారు. -విశ్వంభర-కు సంబంధించి చిరంజీవి డబ్బింగ్ పనులు పూర్తి చేయాలి.

అలాగే ఆ సినిమా రిలీజ్ సమయంలో ప్రచారంలో జాయిన్ అవ్వాలి. ఆ రెండు పనులు కూడా పూర్తి చేస్తే చిరు పూర్తిగా ఆ ప్రాజెక్ట్ నుంచి రిలీవ్ అయినట్లే. నానితో శ్రీకాంత్ తెరకెక్కించేది కూడా భారీ యాక్షన్ థ్రిల్లరే. -రాక్షసుడు- తరహా కాన్సెప్ట్ అని ఇప్పటికే ప్రచారంలో ఉంది. ఈ సినిమాకు సంబంధించి చిరంజీవి గత చిత్రాలకంటే ఎక్కువ కష్ట పడాలి. చిరంజీవి లుక్ పరంగా మార్పు తీసుకొచ్చింది కూడా ఈ సినిమా కోసమేనని ఇప్పటికే ప్రచారంలో ఉంది. మెగాస్టార్ సెకెండ్ ఇన్నింగ్స్ లోనే ప్రత్యేకమైన చిత్రంగా శ్రీకాంత్ ప్రాజెక్ట్ నిలుస్తుందనే టాక్ ఫిలిం సర్కిల్స్ లో నడుస్తోంది.

లవ్లీ సినిమాతో 2012లో తెలుగు ప్రేక్షకులకు హీరోయిన్‌గా పరిచయం అయిన ముద్దుగుమ్మ శాన్వి. మొదటి సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో వెంటనే అడ్డా సినిమాలో నటించే అవకాశం దక్కింది. అయితే అడ్డా సినిమా ఫ్లాప్ కావడంతో తెలుగులో ఈ అమ్మడికి ఆఫర్లు తగ్గాయి. ఆ సమయంలోనే కన్నడంలో చంద్రలేఖ అనే సినిమాతో ఎంట్రీ ఇవ్వడం ద్వారా లక్ కలిసి వచ్చింది. తెలుగులో పెద్దగా ఆఫర్లు రాని సమయంలో కన్నడంలో ఈ అమ్మడు బిజీ అయింది. దశాబ్ద కాలం పాటు కన్నడ సినిమా ఇండస్ట్రీలో ఈ అమ్మడు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా కొనసాగింది. తక్కువ సమయంలోనే ఈ అమ్మడికి అక్కడ ఎక్కువ సినిమాల్లో నటించే అవకాశాలు వచ్చాయి. కేవలం కన్నడ సినిమాల్లోనే కాకుండా అప్పుడప్పుడు ఇతర భాషల్లో కూడా సినిమా ఆఫర్లు రావడం తో అన్ని చోట్ల ఈమె కనిపిస్తూ వచ్చింది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి దాదాపు 15 ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ బిజీగానే ఉంది. తెలంగాణలో టికెట్ ధరల పెంపు.. హైకోర్టు 90 రోజుల రూల్.. లవ్లీ సినిమాతో ఇండస్ట్రీలో అడుగు ఈ లవ్లీ బ్యూటీ ఇప్పటికీ బిజీగా ఉండటానికి కారణం ఆమె అందం అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆమె సినిమా ఇండస్ట్రీకి అడుగు పెట్టి చాలా కాలం అయింది, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆమె అందం పెరుగుతూ వస్తుంది కానీ తగ్గడం లేదు అనేది చాలా మంది చేసే కామెంట్. అందుకే ఆమె ఇండస్ట్రీలో బిజీ బిజీగా సినిమాలు చేసేందుకు గాను ఆఫర్లు దక్కించుకుంటూ ఉంది. ఆకట్టుకునే అందం తో పాటు మంచి నటన ప్రతిభ, అందుకు తగ్గట్టుగా నాజూకు అయిన ఫిజిక్ కావడంతో శాన్వి ఇప్పటికీ సినిమాల్లోనే కాకుండా సోషల్ మీడియాలోనూ హాట్ టాపిక్‌గా ఉంది. ప్రస్తుతం ఈ అమ్మడు చేస్తున్న సినిమాల ప్రమోషన్ కోసం అప్పుడప్పుడు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ ఉంటుంది. అదే సమయంలో తన రెగ్యులర్ డే టు డే లైఫ్ కి సంబంధించిన ఫోటోలు, వీడియోలను సైతం శాన్వి సోషల్ మీడియాలో ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేయడం జరుగుతుంది. ాశ్రీంశీ =ఖుం - సంక్రాంతి విన్నర్స్: బ్రేక్ ఈవెన్ ఎన్ని రోజుల్లో ఫినిష్ చేశారంటే.. శాన్వి ఇన్‌స్టాగ్రామ్ ఫోటోలు వైరల్ తాజాగా శాన్వి సోషల్ మీడియాలో షేర్ చేసిన ఈ ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. సాధారణంగానే ఈ అమ్మడి అందం ముందు అంతా ఆహా అనాల్సిందే. అలాంటిది ఇలా క్లీ వేజ్ షో చేస్తూ మిర్రర్ ముందు నిల్చుని ఫోజులు ఇస్తే ఇంకా ఏమైనా ఉందా అన్నట్టు ఈ ఫోటోలకు నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ మిర్రర్ సెల్ఫీలో శాన్వి మరింత అందంగా, ఆకర్షణీయంగా కనిపిస్తోంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. శాన్వి ఇన్‌స్టాగ్రామ్‌లో గతంలో పోస్ట్ చేసిన అందాల ఆరబోత ఫోటోలతో పోల్చితే ఈ ఫోటోలు ఇంకాస్త అందంగా ఉన్నాయి అనిపిస్తోంది అంటూ ఆమె ఫాలోవర్స్‌తో పాటు పలువురు నెటిజన్స్ ముచ్చటించుకుంటున్నారు. ఇంత అందంగా ఉన్న శాన్వికి తెలుగులో ఆశించిన స్థాయిలో ఆఫర్లు దక్కక పోవడం విచిత్రంగా ఉంది అంటూ కొందరు తెలుగు ప్రేక్షకులు, తెలుగు నెటిజన్స్ ఈ ఫోటోలకు కామెంట్ చేస్తూ చర్చించుకుంటున్నారు. బ్లాక్ బస్టర్ హిట్..మెగాస్టార్ ఎమోషనల్ పోస్ట్! కన్నడ మూవీ త్రిశూలంతో.. ఈమధ్య కాలంలో కేవలం కన్నడంలోనే కాకుండా మరాఠీ, మలయాళ సినిమాల్లోనూ నటిస్తోంది. సినిమాలతో పాటు సమాంతరంగా ఈమె వెబ్ సిరీస్‌లు చేస్తే బాగుంటుంది అని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వయసు పెరిగిన కొద్ది మరింత అందంగా కనిపిస్తున్న ఈ అమ్మడిని చూస్తే ముందు ముందు అయినా టాలీవుడ్‌లో ఆఫర్లు దక్కించుకుని, తెలుగు సినిమాలతో బిజీ అవుతుందా అని కొందరు ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతానికి శాన్వి త్రిశూలం అనే కన్నడ సినిమాలో నటిస్తోంది. ఆ సినిమా కాకుండా మరో రెండు మూడు సినిమాలు చర్చల దశలో ఉన్నాయి. అతి త్వరలోనే ఆ సినిమాలకు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నాయి. మరో వైపు ఒక తెలుగు సినిమా కోసం కూడా ఈమె వద్ద చర్చలు జ రిగాయని తెలుస్తోంది. అయితే ఆ సినిమా కన్ఫర్మ్ అవుతుందా లేదా అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు వెయిట్ చేయాల్సి ఉంటుంది.

# లవ్లీ బ్యూటీ మిర్రర్ షో అదుర్స్



# పేరెంట్స్, భర్త.. రేణు దేశాయ్ ఎమోషనల్ పోస్ట్

సీనియర్ నటి, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మాజీ భార్య రేణు దేశాయ్ సోషల్ వర్కర్ గా మంచి గుర్తింపు తెచ్చుకున్న విషయం తెలిసిందే. వ్యక్తిగత జీవితంలో ఎదురైన ఒత్తిడిని అధిగమించేందుకు సామాజిక సేవను తన జీవితంలో భాగంగా మార్చుకున్నారు. ఓ ఎన్జీవో స్థాపించి మూగజీవాల సంరక్షణకు తన వంతు కృషి చేస్తున్నారు. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ.. వివిధ సామాజిక అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడిస్తూ ఉంటారు.ఎక్కడైనా జంతువులు ఇబ్బందుల్లో ఉన్నాయంటే, వెంటనే స్పందించి సహాయం అందించేందుకు ప్రయత్నిస్తుంటారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వీధి కుక్కల దాడులు, వాటి నియంత్రణ, నిర్మూలన అంశం తీవ్ర చర్చకు దారి తీయగా..




ఆ వ్యవహారం ఏకంగా సుప్రీంకోర్టు వరకు చేరిం. వీధి కుక్కల నియంత్రణపై సర్వోన్నత న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించిం. ఈ నేపథ్యంలో రేణు దేశాయ్ చేసిన వ్యాఖ్యలు, పెట్టిన పోస్టులు పెద్ద చర్చనీయాంశంగా మారాయి.సాధారణంగా కూల్ గా, నవ్వుతూ మాట్లాడే రేణు ఈసారి మాత్రం తీవ్ర ఆవేశంతో స్పందించారు. వీధి కుక్కలను చంపడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో, కొందరు నెటిజన్లు ఆమెను తీవ్రంగా విమర్శించారు. దీనిపై స్పందిస్తూ రేణు దేశాయ్ తాజాగా భావోద్వేగ పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం అ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. కాశీలో గంగా నదిలో బోటింగ్ చేస్తున్న వీడియోను షేర్ చేసిన రేణు, తన మనోవేదనను ఆ పోస్టులో వెల్లడించారు."నన్ను కాపాడటానికి అమ్మానాన్న, అన్నయ్య, భర్త ఎవరూ లేరు. తాజా అంశంలో నా తప్పు లేకున్నా కొంతమంది నన్ను విమర్శిస్తున్నారు. మీరు చేసే వ్యాఖ్యలపై తిరిగి స్పందించను. నేను నమ్మే భగవంతుడు దగ్గర మాత్రమే నా బాధను చెబుతాను. ఆయన నా ప్రార్థన వింటాడన్న నమ్మకం నాకు ఉం. నేను తరచూ కాశీకి ఎందుకు వెళ్తానో మీకు అర్థమై ఉంటుంది" అని ఆమె రాసుకొచ్చారు.అంతేకాదు, వీధి కుక్కల విషయంలో తన పోరాటం కొనసాగుతుందన్న విషయాన్ని మరోసారి స్పష్టం చేశారు. "నేనెప్పుడూ నా వ్యక్తిగత హక్కుల కోసం పోరాడలేదు. కానీ వీధి కుక్కల విషయంలో పోరాటం ఆపను. కొన్ని కుక్కలు చేసిన తప్పు వల్ల వందల సంఖ్యలో వాటిని చంపాలనే నిర్ణయం సరైనది కాదు. ఈ విషయాన్ని మీరు అర్థం చేసుకునే వరకూ పోరాడుతూనే ఉంటాను" అని రేణు పేర్కొన్నారు.ఈ వ్యవహారంపై ఆమె ప్రెస్ మీట్ అనంతరం రాజకీయ పార్టీలో చేరనున్నారన్న వార్తలు కూడా సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. అయితే ఆ ప్రచారాన్ని రేణు ఖండించారు. తనకు రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం లేదని, ఇది పూర్తిగా మూగజీవాల సంరక్షణ కోసం చేస్తున్న పోరాటమేనని స్పష్టతనిచ్చారు. సామాజిక సేవే తన లక్ష్యమని, ఎన్ని విమర్శలు వచ్చినా జంతువుల కోసం పోరాటం కొనసాగిస్తానని రేణు దేశాయ్ మరోసారి తేల్చిచెప్పారు.